నమస్తే తెలంగాణ

రంగారెడ్డి

I | హైదరాబాద్, ఆదివారం 2 మార్చి 2025 | RANGAREDDY

కష్టమొచ్చినా.. సంతోషమొచ్చినా అందరికీ కేసీఆరే గుర్తుకొస్తున్నారు..

కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల వారు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రేవంత్‌తో పాటు మంత్రులకు రాష్ట్రంతోపాటు ప్రజలపై ఏ మాత్రం బాధ్యత లేదు..గాలికి మాట్లాడుతున్నారు. వారు ఏమి మాట్లాడుతున్నారో వాళ్లకే అర్థం కావడం లేదు. ఏడాదిన్నర దాటినా ఒక్క పథకమూ సక్రమంగా అమలు కావడంలేదు.. ఇందిరమ్మ ఇండ్లు వస్తున్నాయని.. రేషన్‌కార్డులు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం తప్ప ఇప్పటికీ ఇచ్చింది ఒక్కటి లేదు. ఏమన్నంటే ఫ్రీ బస్సు అమలు చేస్తున్నామని చెబుతున్నారు. మనం బస్సు ఇప్పుడే ఎక్కుతున్నట్లు, ఎప్పుడూ ఎర్ర బస్సు మొఖం చూడనట్లు మాట్లాడుతున్నారు. ఒక్కటి మాత్రం నిజం.. తెలంగాణలో ప్రజలకు కష్టమొచ్చినా.. సంతోషమొచ్చినా కేసీఆర్‌నే గుర్తుకు చేసుకుంటున్నారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో మేమంతా సంతోషంగా ఉన్నామని ప్రజలు చెబుతున్నారు. పెద్దాయన(కేసీఆర్)ఉంటే తమకు కష్టాలు వచ్చేవి కాదని పేర్కొంటున్నారు. ఏ గ్రామానికెళ్లి ఎవరినీ అడిగినా ఒక్కటే అంటున్నారు.. ఈ కాంగ్రెస్ పాలన ఎప్పుడు పోతుందని.. ఎన్నికలు ఎవైనా గెలుపు మాత్రం బీఆర్ఎస్‌దే కావాలి. అందుకు సిద్ధంగా ఉండాలి.

-సబితారెడ్డి, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే

హైడ్రాతో రియల్ విధ్వంసం

- కుర్చీని కాపాడుకునేందుకే మూసీ సుందరీకరణ డ్రామా..
- పేదల ఇండ్లను కూల్చి వారిని రోడ్డు పాలు జేశాడు
- రూ. లక్షా యాభై వేల కోట్ల మూసీ ప్రాజెక్టుతో ఢిల్లీకి సంచులు
- సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్
- తెలంగాణ భవన్‌లో ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు

సిటీబ్యూరో, మార్చి 1 (నమస్తే తెలంగాణ) /షాబాద్ : హైడ్రా, మూసీ సుందరీకరణ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ రంగాన్ని విధ్వంసం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. శనివారం తెలంగాణ భవన్‌లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని సుమారు 500 మంది బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లను కూల్చి వారిని రోడ్డు పాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రాను తన కోసమే తీసుకొచ్చినట్లుగా జన్వాడలోని తన ఇంటిని కూల్చేందుకూ తీవ్ర ప్రయత్నం చేశారని ఆరోపించారు. రూ.లక్షా యాభై వేల కోట్ల మూసీ ప్రాజెక్టుతో ఢిల్లీకి డబ్బుల సంచులు పంపించి తన కుర్చీని కాపాడుకునేందుకు రేవంత్ ప్రయత్నిస్తున్నారన్నారు. మూసీ సుందరీకరణతో ఎవరికి లాభం కలుగతుంది..? ఎన్ని ఎకరాలకు నీరు పారుతుంది..? ఎంతమంది రైతులు బాగుపడతారు..? సృష్టించే సంపద ఎంత ? అని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వంలో చాలామంది శంకర్‌పల్లి పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుని ఉపాధి పొందారని.. కానీ, 15 నెలల కాంగ్రెస్ పాలనలో రియల్ రంగం పూర్తిగా పడిపోయిందని.. భూముల ధరలు గణనీయంగా తగ్గాయని.. ఈ రంగాన్ని నమ్ముకున్న ఎంతో మంది వ్యాపారులు రోడ్డున పడ్డారన్నారు.

అనంతరం శంకర్‌పల్లి మాజీ ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని పాతిపెట్టి, బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నా కోరికను మన్నించి పిలవగానే నా వెంట తెలంగాణ భవన్‌కు వచ్చిన కార్యకర్తలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు అని చెప్పారు. తనను మళ్లీ పార్టీలోకి చేర్చుకున్నందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ శంకర్‌పల్లి మండల పార్టీ అధ్యక్షుడు గండిచెర్ల గోవర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు రాజూనాయక్, మాణిక్యరెడ్డి, పాపారావు, వేణుగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఉప ఎన్నికలు.. ఎమ్మెల్యేగా కార్తీక్‌రెడ్డి

రాష్ట్రంలో త్వరలో ఉప ఎన్నికలు రానున్నాయని.. కార్తీక్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొంది శాసన సభలో అడుగుపెట్టబోతున్నారని కేటీఆర్ జోస్యం చెప్పారు. సబితాఇంద్రారెడ్డి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని కాంగ్రెస్, బీజేపీ నాయకులకు చుక్కలు చూపిస్తున్నారని పేర్కొన్నారు. చేవెళ్ల జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని.. దానిని విస్తరించాలని కేసీఆర్ ఎన్నిసార్లు ప్రతిపాదించినా కేంద్రం స్పందించలేదన్నారు. చేవెళ్ల నుంచి ఎంపీగా గెలుపొందిన విశ్వేశ్వర్‌రెడ్డి ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. దేవుడి పేరు చెప్పుకొని ఆక్షింతలు పంచాలి, ఓట్లు వేయించుకోవాలి, అవతల పడాలి అన్న తీరులో ఎంపీ ఉన్నారని ఎద్దేవా చేశారు.

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా చేవెళ్ల, శంకర్‌పల్లిలకు నీటిని తీసుకొచ్చేందుకు ఆనాడు కేసీఆర్ కృషి చేస్తే.. కాంగ్రెస్ పార్టీ నేతలు కేసులు వేసి ఆపే ప్రయత్నం చేశారని.. అయినా ఆ పనులను 90 శాతం వరకు పూర్తి చేశామన్నారు. ఆ పనులు పూర్తైతే శంకర్‌పల్లి, చేవెళ్ల ప్రాంతాలు సస్యశ్యామలం అవుతాయన్నారు. రేవంత్‌రెడ్డి.. సాగునీటి ప్రాజెక్టులను ఆపి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీల ద్వారా రూ. లక్ష కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన ఘనత కేసీఆర్‌దనే అని కొనియాడారు.

బీఆర్ఎస్ యువ నేత కార్తీక్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారు..

కాంగ్రెస్ పాలనతో విసుగు చెందిన ప్రజలంతా మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారు. ఈ రోజు తెలంగాణ భవన్‌లో జరిగిన చేరికలను చూస్తుంటే అధికారాన్ని కోల్పోయిన పార్టీ కార్యాలయం ఏలా ఉంటుందో అలా లేదు.. పది, పదిహేను ఏండ్లు అధికారంలో ఉన్న పార్టీ కార్యాలయంలో ఏ విధంగా కార్యక్రమాలు జరుగుతాయో .. ఎంత సందడిగా ఉంటుందో అలా ఉన్నది. గత ఆరు నెలలుగా ప్రతిరోజూ ఇతర పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరి కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చుతున్నారు. మళ్లీ కేసీఆర్ అధికారంలోకి వచ్చే వరకూ మనమందరం కలిసి కట్టుగా కష్టపడి పనిచేద్దాం.

-పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర యువనేత

తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన మహిళా నాయకురాలు, కార్యకర్తలతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

కాల్ నొక్కేస్తున్నారు..!

- అవినీతి ఫిర్యాదులపై కాల్‌సెంటర్‌కు స్పందన కరువు
- సెప్టెంబర్‌లో ప్రయోగాత్మకంగా అమలు
- ప్రజలకు అవగాహన కల్పించడంలో ఎస్పీడీసీఎల్ విఫలం

సిటీబ్యూరో, మార్చి 1(నమస్తే తెలంగాణ): విద్యుత్తు శాఖలో అవినీతి మితిమీరిన స్థాయికి చేరింది. ఉన్నతాధికారులు మొదలుకొని కిందిస్థాయి ఉద్యోగుల వరకు గత పది నెలలుగా ఏడుగురు ఏసీబీకి చిక్కడం చర్చనీయాంశమైంది. తాజాగా ఏడీఈ కార్యాలయంలో సతీశ్ లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడంతో మరోసారి ఎస్పీడీసీఎల్‌లో కొందరు ఉద్యోగుల అవినీతిపై చర్చ జరుగుతున్నది. సెప్టెంబర్‌లో సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఖైరతాబాద్‌లోని కార్పొరేట్ కార్యాలయంలో అవినీతి ఫిర్యాదు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రెండు నంబర్లు 04023454884, 7680901912 ఇవ్వగా.. వీటికి మొదటి నెల తర్వాత పెద్దగా స్పందన లేదు. ఈ కేంద్రానికి మొదట్లో పదినుంచి పదిహేను ఫిర్యాదులొచ్చాయి. అయితే వీటిపై ఉన్నతాధికారుల నుంచి సీరియస్‌గా స్పందన లేకపోవడంతో ఫిర్యాదుల సంఖ్య రానురాను తగ్గింది. కాల్‌సెంటర్‌కు స్పందన వస్తుందనుకున్నారో ఏమో.. ఇక ఆ విషయాన్నే మరిచిపోయారు. దీనికి కారణమేంటనే దిశగా సీఎండీ ఆరా తీశారు.

డిస్కంకు చెడ్డపేరు..!

కొందరు అవినీతి ఉద్యోగుల చర్యలతో మొత్తం డిస్కంకే చెడ్డపేరు వస్తున్నదంటూ సీఎండీ ఉద్యోగులకు ఎప్పటికప్పుడు వార్నింగ్ ఇస్తున్నారు. గతేడాది చివరలో ఏడుగురు అధికారులను సస్పెండ్ చేయడమే కాకుండా తొమ్మిది మందికి షోకాజ్‌నోటీసులు ఇచ్చారు. విద్యుత్తు శాఖలో అధికారులు ఎవరైనా పనికి లంచం అడిగితే ఫిర్యాదు చేయాలని సీఎండీ తెలిపారు. ఇందుకోసం సీఎండీ కార్యాలయంలో అవినీతి ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని చెప్పారు. మొదట్లో సీఎండీ ఈ విషయంలో సీరియస్‌గా స్పందించినప్పటికీ ఆ తర్వాత సమ్మర్ యాక్షన్ ప్లాన్ నేపథ్యంలో బిజీ అయిపోయారు. దీంతో ఈ వ్యవస్థనంతా చీఫ్ విజిలెన్స్ విభాగం వారు పర్యవేక్షించాలి. అయితే కాల్‌సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదులపై స్పందించడంలో సంబంధిత విభాగం పూర్తిగా విఫలమైందనే చెప్పాలి. ఎందుకంటే ఫిర్యాదుల్లో ఎక్కువగా సైబర్‌సిటీ, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలతోపాటు రూరల్ ప్రాంతాల నుంచి ఉన్నాయి. వీటిపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాల్సిన డిస్కం అధికారులు ఆ దిశగా స్పందించలేదనే విమర్శలున్నాయి. తాము ఇచ్చిన ఫిర్యాదులపై విచారణ జరగకపోవడంతో వినియోగదారుల్లోనూ ఈ కాల్‌సెంటర్‌పై నమ్మకం పోయిందని, అందుకే ఫిర్యాదుల సంఖ్య క్రమక్రమంగా తగ్గిపోయిందని డిస్కం అధికారులే చెబుతున్నారు

స్టిక్కర్లకే పరిమితం..!

అన్ని శాఖల్లోకెల్లా ఎక్కువ జీతాలున్న శాఖగా విద్యుత్తు శాఖకు పేరున్నది. అదే సమయంలో కొందరు అవినీతి ఉద్యోగుల కారణంగా మొత్తం శాఖకే మకిలి పట్టింది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అవినీతి నిర్మూలన కోసం సీఎండీ ముషారఫ్ ఒక ప్రయోగం చేశారు. ఇందుకు సంబంధించి ఇచ్చిన కాల్‌సెంటర్ల నంబర్లు కేవలం స్టిక్కర్ల వరకే పరిమితంకాగా క్షేత్రస్థాయిలో మొత్తం దక్షిణ డిస్కం పరిధిలో పెద్దగా ప్రచారం జరగడం లేదన్న విమర్శలున్నాయి. ప్రధానంగా ఈ అవినీతి నిరోధానికి, లంచం అడిగితే వెంటనే ఫిర్యాదు చేయాలన్న అవగాహన వినియోగదారుల్లో కల్పించేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలను కూడా కిందిస్థాయిలోనే ఆపేస్తున్నారు. ఈ నంబర్లపై పెద్దగా ప్రచారం కూడా చేయడం లేదు. దీంతో ప్రజల్లో ఈ నంబర్ల గురించి పెద్దగా తెలియదనే చెబుతున్నారు. స్టిక్కర్లు ఎక్కడో కార్పొరేట్ కార్యాలయంలో, అక్కడక్కడా జోనల్ ఆఫీసుల్లో కనిపించి కనిపించకుండా వేయడం ద్వారా ఏం ప్రయోజనముంటుందన్న వాదనా వినిపిస్తున్నది. ప్రజల్లో అవగాహన కల్పించే దిశగా ఇప్పటికైనా సీఎండీ చొరవ తీసుకుని డిస్కంలో అవినీతి నిరోధానికి చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

డైరెక్టర్ల నియామకమెప్పుడో..?

- నోటిఫికేషన్ ఇచ్చి 14 నెలలైనా ఊసేలేదు..
- ఇన్‌చార్జీలతో కొనసాగిస్తున్న టీజీఎస్పీడీసీఎల్
- విద్యుత్తు సరఫరాపై మొక్కుబడి పర్యవేక్షణ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 11(నమస్తే తెలంగాణ): టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో నిరంతరం నాణ్యమైన కరెంట్ సరఫరా జరిగేలా చూడాల్సిన డైరెక్టర్ల నియామకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. సాధారణంగా డైరెక్టర్లు విద్యుత్తు సంస్థల పాలకమండలిలో సభ్యులుగా ఉంటారు. వీరు తమ పరిధిలోని డిస్కంలలో విద్యుత్తు సరఫరా, నిర్వహణలపై పర్యవేక్షిస్తుంటారు. ప్రధానంగా గత ప్రభుత్వహయాంలో 24 గంటల విద్యుత్తు సరఫరాలో వీరి పాత్ర కీలకంగా చెప్పుకోవాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే డైరెక్టర్లను తొలగించి వారి స్థానంలో సీజీఎంలు, సీఈ స్థాయి అధికారులకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఆ తర్వాత కొత్త డైరెక్టర్ల నియామకానికి ఆయా సంస్థలు నోటిఫికేషన్ ఇచ్చాయి. నోటిఫికేషన్ ఇవ్వడం, దరఖాస్తుల స్వీకరణ శరవేగంగా పూర్తిచేసినా డైరెక్టర్ల నియామకం మాత్రం నెలలు గడుస్తున్నా పూర్తి కావడంలేదు. కనీసం దరఖాస్తుల పరిశీలన కూడా జరగలేదని దరఖాస్తుదారుల్లో కొందరు చెబుతున్నారు.

పల్లె పట్నమైంది.. ఉపాధి దూరమైంది..

- పెరుగుతున్న మున్సిపాలిటీలు.. మాయమవుతున్న గ్రామాలు
- ఊర్లకే పరిమితమైన ఉపాధి హామీ పనులు
- మున్సిపాలిటీల్లో రద్దైన పథకం
- ఇబ్బందుల్లో అక్కడ జీవిస్తున్న వేలాది మంది పేదలు

తమకూ పని కల్పించాలని వేడుకోలు

గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు వలసలు వెళ్లకుండా నిరోధించేందుకు ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చారు. ఈ స్కీమ్ కింద కనీసం వంద రోజులు కూలీలకు ఉపాధి కల్పిస్తారు. అలాగే, జాబ్ కార్డు కలిగి ఉండి 20 రోజులు పనిచేసిన వారికి ఏడాదికి రూ.12,000 ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తామని రేవంత్ సర్కార్ ప్రకటించింది. అయితే, మున్సిపాలిటీలు, వాటిలో విలీనమైన గ్రామాల్లో ఉపాధి హామీ పథకం అమల్లో లేకపోవడంతో అక్కడ జీవిస్తున్న కూలీలు పనులకు దూరం కావడమే కాకుండా ఆత్మీయ భరోసాకూ నోచుకోవడంలేదు. జిల్లాలోని ఇబ్రహీంపట్నం, కొత్తూరు, ఆమనగల్లు, షాద్‌నగర్, చేవెళ్ల, మొయినాబాద్ తదితర మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిలిచిపోవడంతో పనిలేక ఇబ్బంది పడుతున్నామని.. ప్రభుత్వం స్పందించి తమకు పని కల్పించాలని కూలీలు, ప్రజలు కోరుతున్నారు.

- రంగారెడ్డి, మార్చి 1 (నమస్తే తెలంగాణ)

జిల్లాలో సగానికి పైగా పట్టణ ప్రాంతాలుండడంతో అవి మున్సిపాలిటీలుగా అవతరించాయి. ఇబ్రహీంపట్నం, కొత్తూరు, ఆమనగల్లు, షాద్‌నగర్, చేవెళ్ల, మొయినాబాద్ తదితర మున్సిపాలిటీలు, వాటిలో విలీనమైన గ్రామాల్లో ఉపాధి హామీ పథకం అమల్లో లేకపోవడంతో అక్కడ జీవిస్తున్న కూలీలు పనులు దొరక్క, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అర్హులు కాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లాలో గతంలో 14 మున్సిపాలిటీలుండగా.. కొత్తగా చేవెళ్ల, మొయినాబాద్‌లను కూడా పురపాలికలుగా ప్రభుత్వం ప్రకటించడంతో వాటి సంఖ్య 16కు చేరింది. అదే విధంగా 21 మండలాలుండగా, అందులో సగం వరకు మున్సిపాలిటీల పరిధి విస్తరించి ఉన్నది. దీంతో గ్రామీణ ప్రాంతాలూ మున్సిపాలిటీలుగా అవతరించడంతో వాటిని కూడా పట్టణ ప్రాంతాలుగానే పరిగణిస్తున్నారు. అలాగే, ప్రస్తుతం జిల్లాలో 2 కార్పొరేషన్లు ఉన్నాయి. వాటిలోనూ ఉపాధి హామీ పథకం నిలిచిపోయింది. కొత్తగా మరో 20 గ్రామపంచాయతీలను కలుపుతూ.. ఫ్యూచర్‌సిటీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నది. ఈ కార్పొరేషన్ ఏర్పాటైతే మరో 20 గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిలిచిపోనున్నది. జిల్లాలో 549 గ్రామ పంచాయతీలుండగా ఇటీవల మరో 30 పంచాయతీలు మున్సిపాలిటీల పరిధిలో చేరిపోయాయి. ఈ గ్రామాల్లోని కూలీలు ఉపాధి హామీ పనులతోపాటు ఆత్మీయ భరోసా పథకానికి దూరం కానున్నారు. ఇటీవల మున్సిపాలిటీల్లోనూ పేదలున్నారని.. వారికీ ఉపాధి హామీ పథకాన్ని వర్తింపజేయాలని న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.. అయినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ఇబ్బందుల్లో కూలీలు..

జిల్లాలో ఉన్న 16 మున్సిపాలిటీల్లో సగానికి పైగా గ్రామీణ ప్రాంతాలు కలిసినవే. ఆమనగల్లు, షాద్‌నగర్, కొత్తూరు, ఇబ్రహీంపట్నం, పెద్దఅంబర్‌పేట, తుర్కయాంజాల్, మొయినాబాద్, చేవెళ్ల మున్సిపాలిటీలు గ్రామీణ ప్రాంతాలతో విలీనమై ఉన్నాయి. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో సీతారాంపేట, శేరిగూడ, ఖానాపూర్.. తుర్కయాంజాల్ మున్సిపాలిటీలో కొహెడ, బ్రాహ్మణపల్లి, మన్నెగూడ.. ఆదిబట్ల మున్సిపాలిటీలో మంగల్‌పల్లి, కొంగర, పటేల్‌గూడ, రాందాస్‌పల్లి, బొంగ్లూరు వంటి గ్రామాలుండగా వాటిని మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. విలీనమైన గ్రామాల్లో ఉపాధి హామీ పథకం అమల్లో లేదు. అలాగే, కొత్తూరు, చేవెళ్ల, మొయినాబాద్, షాద్‌నగర్ వంటి మున్సిపాలిటీలను చుట్టూ ఉన్న గ్రామాలతోనే పురపాలికలుగా అధికారులు ఏర్పాటు చేశారు. ఈ ఊర్లలోనూ ఉపాధి హామీ పథకం కొనసాగడం లేదు. దీంతో పలు గ్రామాల ప్రజలు తమను మున్సిపాలిటీల్లో కలిపినందుకు సంతోషపడాలా.. ఉపాధి హామీ పథ కాన్ని కోల్పోయినందుకు బాధపడాలో తెలియడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపాలిటీలోనూ పేదలున్నారు

మున్సిపాలిటీల్లో చుట్టూ ఉన్న గ్రామాలను విలీనం చేశారు. ఆ గ్రామాల్లోనూ ఎంతోమంది కూలీలు ఉన్నారు. వారికి ఉపాధి హామీ పథకం వర్తించడంలేదు. వారికి పనులు దొరకని పరిస్థితి నెలకొన్నది. అలాగే, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకూ దూరమవుతున్నారు. ప్రభుత్వం స్పందించి మున్సిపాలిటీల పరిధిలోని గ్రామాల్లో ఉపాధి హామీ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చి వారికి పని కల్పించాలి. **-నీలం శ్వేత, మాజీ కౌన్సిలర్**

పనిలేక ఇబ్బందిగా ఉన్నది..

ఎవరన్నా వ్యవసాయ పనులకు పిలుస్తారనుకుంటే పంటలు పండడం లేదు. నీళ్లులేక బోరుబావులు ఎండిపోయి పొలాలు పడావుగా మారాయి. మున్సిపాలిటీలో మా గ్రామాన్ని కలపడంతో ఉపాధి హామీ పనిని అధికారులు బంద్ చేశారు. ఉపాధి పని ఉన్నప్పుడు నాలుగు రూపాలు వస్తుం డే. కాయకష్టం చేసుకుని బతికే నాలాంటి పేదలకోసం సర్కారు ఉపాధి హామీ పనిని కల్పించాలి. **-పాపమ్మ, సీతారాంపేట**